పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణమస్తు, షాదీతోఫా

ప్రజాశక్తి-రాయచోటి

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కుటుంబాల్లో చెల్లెమ్మల వివాహాలకు అండగా నిలిచేందుకు వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం ఏప్రిల్-జూన్‌లో వివాహం చేసుకున్న 333 మంది జంటలకు రూ.2.96 కోట్ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడం, ప్రతి చెల్లెమ్మ, ప్రతి తమ్ముడిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం పేద కుటుంబాల్లోని వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఒక సమున్నత లక్ష్యంతో వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఇతర మైనార్టీలు, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని అమ్మాయిల వివాహం నిమిత్తం ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టీచర్స్ ఎంఎల్‌సి ఎం.రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డిఆర్‌డిఏ పీడీ సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి : కలెక్టర్

గిరిజన విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కలెక్టర్ గిరీష్ పి.ఎస్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ గిరీష్ పి.ఎస్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని గిరిజన నాయకులతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీలందరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. చదువుతోనే తలరాత మారుతుందని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గిరిజనులు ఎంత బాగా చదివితే భవిష్యత్తు అంత బాగా మారుతుందని పేర్కొన్నారు. చదువుకున్న వారు ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పుడు వారు మరో 10 మందికి సాయం చేయగలిగే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. చదువు కేవలం సంపాదన కొరకే కాదని, భవిష్యత్ తరాలను ముందుకు నడిపిస్తుందని, చెప్పారు. గిరిజనులు వారి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఇంకా చాలా చోట్ల విద్యా వైద్యానికి గిరిజనులు చాలా దూరం ఉన్నారని, అవన్నీ వారికి అందించాలనే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలతో పాటు అనేక పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని చెప్పారు. వీటన్నింటినీ మీరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని, తమ దృష్టికి వచ్చిన గిరిజనుల సమస్యలన్నీ వందశాతం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే స్పందనలో కానీ, నేరుగా కానీ తనని కలవవచ్చునని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం శాఖ కూడా గిరిజనుల సంక్షేమం అని కాకుండా తండాలలో నెలకొంటున్న సమస్యలు వాటి పరిష్కారం పై దృష్టి పెట్టాలని సూచించారు. అటవీ పరిధిలో భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు గ్రామసభల ద్వారా తీర్మానం చేసుకొని పంపితే చట్టం పరిధిలో మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. దాదాపు వైఎస్ఆర్ తరువాత ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో దాదాపు 4వేల మందికి భూ పంపిణీ చేశామని, ఇందులో 450 దాకా ఎస్టీ కుటుంబాలు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా అభివృద్ధిలోకి రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ గిరిజన నాయకులు వివిధ అంశాలపై సమావేశంలో వివరించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన గిరిజన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో బహూకరించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అబ్దుల్ లొమ్, గిరిజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మోడీ విధానాలను తిప్పికొట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దేశంలో అమలవుతోన్న మోడీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో దేశం ప్రమాదంలోకి వెళ్లిందని, నాడు భారత ప్రజానీకం బ్రిటీష్ సామ్రాజ్యవాదులను క్విట్ ఇండియా పేరుతో తరిమికొట్టారని అదే స్ఫూర్తితో నేడు మోడీ విధానాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపు మేరకు బుధవారం రెవెన్యూ శాఖ కార్యాలయం ఎదుట సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం రైతుసంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు, రైతులు, ప్రజలు, దళిత బహుజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అధికారం లోకి వచ్చిన తర్వాత పేదరికం, నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు, మహిళల పై నిత్యం దాడులు మాన భంగాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, వ్యవసాయ నల్లచట్టాలు, దళితులపై దాడులు, రచయితలు, మహిళా హత్యలు, దేవాలయాలు పుట్టగొడుగుల విస్తరణ, రూపాయి విలువ పడిపోవడం వంటివి చోటు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వదిలి మూఢనమ్మకాలతో మనువాదాన్ని తెచ్చి రాజ్యాంగానికి తూట్లు పొడిచి దేశ ప్రజల మధ్య అసమానతలు పెంచి పోషిస్తున్నారన్నారు. హద్దు లేని నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ఎనిమిది లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని పెట్టుబడిదారులకు రాయితీ ఇచ్చి చేతులు దులుపుకోవడంతోనే రెగ్యులర్ ఉద్యోగాలు రావడంలేదన్నారు. ఉన్న పరిశ్రమలు అమ్మకానికి పెట్టి భారత ఖజానాను పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతున్న మోడిని ఓడించాలన్నారు. ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఎస్.రామచంద్ర, రంగారెడ్డి మాట్లాడుతూ కార్మిక కర్షక మైత్రితో వ్యవసాయ నల్ల చట్టాలు, లేబర్ కోడ్లు, మోటర్లకు మీటర్లు బిగించడం, కలదురంహకార హత్యలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరుగుతున్నాయని వాపోయారు. ఉద్యమకారులు, ప్రజాతంత్ర శక్తులు దేశవ్యాప్తంగా గట్టిగా ప్రతిఘటించి మతసామరస్యాన్ని ప్రభుత్వ రంగాలకు కాపాడాలని పెద్ద ఎత్తున ప్రజలతో సంతకాల సేకరణ చేసి డిప్యూటీ తహశీల్దార్ తాశీల్దార్ ద్వారా గవర్నర్‌కు పంపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, రైతుసంఘం బసిరెడ్డి, జిల్లా కో- కన్వీనర్ డి.సి. వెంకటయ్య, చిన్న నారాయణ, డీలర్ శీను, చల్లా రెడ్డెయ్య, ఐద్వా నాయకురాల్లు బంగారుపాప, సిద్ధమ్మ, నాగమణి, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, విద్యార్థులు దిలీప్, నిరంజన్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

31లోగా ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 31వ తేదీ లోగా ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాలని డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయిలో సైన్సు ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యానూన్యాల పాఠశాలల నుంచి ఇన్‌స్పైర్ నామినేషన్‌లను ఈనెల 31లోపు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ప్రతి హైస్కూల్ నుంచి ఐదు నామినేషన్లను తప్పక చేయాలన్నారు. జిల్లా డిఎస్ఒ ఎం.ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రేడిమేడ్ నమూనాలు అనుమతించబడవని, చిన్నారుల యొక్క మది నుండి వచ్చిన ఆలోచనలను కార్యరూపం దాల్చేవిధంగా ఉండన్నారు. వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శనకు ఎంపిక చేయాలని సూచించారు. రిసోర్సు పర్సన్ ఎం.భాస్కరన్ ఎంపిక చేయవలసిన నమూనాలు డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్వస్థ భారత్, స్వచ్ఛభారత్ అనే ప్రధాన అంశాలతో తయారు చేయాలని చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఎంపిక చేయబడే ఎక్జిబిట్లకు రూ.పది వేల ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పిఎల్ఎన్ శాస్త్రి, వర ప్రసాద్, కె.భాస్కర్, డివిజనులోని భౌతిక, రసాయనిక, జీవ శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో రిజర్వ్ ఫారెస్ట్ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధితాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆర్ఒఎఫ్ఆర్ రిజర్వ్ ఫారెస్టు అంశాలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని స్పందనలో అర్జీలు ఇస్తున్నారని, ఇందుకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. చిట్వేలు మండలంలో నగిరిపాడు పంచాయతీ పెద్దూరు, చెర్లోపల్లి, వీరబల్లి మండలం షికారు పాలెంకుచెందిన గిరిజనులు అనుభవంలో ఉన్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. అ ఆయా మండలంలో గిరిజనుల స్థితిగతులు, వారు సాగు చేస్తున్న అటవీ భూమి విస్తీర్ణం తదితరాలను పరిశీలించాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఆ మండలాలలో అటవీ భూములకు బదులుగా ప్రభుత్వ భూములను కూడా గుర్తించాలని, అసైన్డ్ భూములకు సంబంధించి లబ్ధిదారులను కూడా గుర్తించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఎఫ్ఒ వినోద్, డిఆర్ఒ సత్యనారాయణ రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధికి భాగస్వాములమవుదాం

ప్రజాశక్తి-రాయచోటి

అందరం కలిసికట్టుగా దేశ అభివృద్ధికి భాగస్వాములు అవుదామని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం చిన్నమండెం మండలంలోని కేశాపురంలో నాభూమి-నా దేశం నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ వాతావరణంలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జీవితంలోని ప్రతిరోజు, ప్రతి క్షణం, శరీరంలోని ప్రతి అణువు మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నిజ నివాళి అని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దామని తెలిపారు. అంతకుముందు నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను కలెక్టర్ ఎగరవేశారు. అనంతరం మొక్కల నాటి నీళ్లుపోశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు దోహదం చేస్తాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు దోహదం చేస్తాయని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ విసి హాలులో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించి జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగు పడుతుందన్నారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నారని, ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలని తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలలో ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. యువతకు ఉపాధినిచ్చే నైపుణ్య అభివృద్ధి కల్పనలో సంబంధిత అంశాల్లో శిక్షణ అందించి యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లాలో పరిశ్రమల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. ఇందులో సింగిల్ డెస్క్ పోర్టల్ కింద వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో మొత్తం 1558 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 1498 దరఖాస్తులకు ఆమోదం తెలిపామని చెప్పారు. మిగిలిన వాటికి కూడా గడువు లోపల అర్హతలను పరిశీలించి త్వరిత గతిన ఆయా శాఖలు అనుమతులు జారీ చేయాలని కలెక్టరు సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్న ఎంఎస్ఎంఇలకు అర్హతల మేరకు లబ్ధి చేకూర్చామని చెప్పారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా 2020-23 ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ కింద రవాణా రంగంలో ఎస్సీ, ఎస్టీలకు పెట్టుబడి రాయితీ కింద జిల్లాలో మొత్తం 32 యూనిట్లకు గాను కేటగిరీల వారీగా ప్రోత్సాహక రాయితీ మొత్తం రూ.1,45,56,489 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. పిఎంఇజిపిపథకం కింద 2023-24లో ఇప్పటి వరకు197 యూనిట్లకు బ్యాంకుల ద్వారా రూ.5.23 కోట్లు మార్జిన్ మనీ మంజూరు చేశామని తెలిపారు. అనంతరం జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలు, ఎపి ఐఐసి ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పరిశ్రమలకు భూమి కేటాయింపు, సేల్ డీడ్ల అనుమతులు గురించి సంబంధిత అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, ఎల్‌డిఎం వెంకటేశ్వరరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి వి.నాగభూషణం, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

77, 108 జిఒలను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిఒ 77, 108లను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక ఐటిఐ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తూ కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తానని హామీ ఇచ్చిన జగన్ నేడు జిఒ నెంబర్ 77 తీసుకు వచ్చి ప్రయివేట్ కళాశాలలో పిజి చదివే విద్యార్థులు విద్యాదీవెన, వసతిదీవెన వర్తించదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆ జిఒతో అధిక ఫీజులు కట్టలేక, ఉన్నత చదువులు చదవలేక విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ వైద్యాశాఖ తీసుకువచ్చిన జిఒ నెంబర్ 108 కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో మెరిట్ ఆదారిత ప్రవేశాలను పక్కదారి పట్టిస్తూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ పేరిట ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మలిచి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఒక పక్క పిజి విద్యను నాశనం చేస్తూ ఇంకో పక్క వైద్య విద్యతో వ్యాపారం చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల పాలిట శాపమైన జిఒ నెంబర్ 77, 108లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమం చెపాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌరీశంకర్ ఉపేంద్ర, చరణ్, చెంగయ్య, నరసింహ, భరత్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిఎల్ఎలను త్వరగా నియమించాలి : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రాజకీయ పార్టీలన్నీ బిఎల్ఎలను త్వరగా నియమించాలని, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు సహకరించాలని, వాలంటీర్ ఉపయోగించుకున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ గిరీష తెలిపారు. జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ, బిఎల్ఎల నియామకం, ఇంటింటికి వెళ్లి ఓటర్ల ధ్రువీకరణ, తదితర అంశాల మీద వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ బిఎల్ఎలను త్వరగా నియమించాలని, అప్పుడే మనం తప్పులు లేకుండా ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేయగలమని సూచించారు. నియామకానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఎలక్షన్ సెల్‌లో సమర్పించాలని కోరారు. ఓటర్ల జాబితా కు సంబంధించి ఓటర్లను చేర్చడం తీసివేయడం, సరి చేయడంకు సంబంధించి వివిధ ఫార్మాట్ల దరఖాస్తులను ఓటర్ల నుంచి తీసుకోవడం జరిగిందని ఏయే ఓటర్ల నుంచి వాటిని తీసుకున్నామో అవన్నీ రాజకీయ పార్టీలన్నింటికీ ఇచ్చామని తెలియజేశారు. వీటిల్లో ఏమైనా సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. పోలింగ్ బూత్‌ల హేతుబద్ధీకరణకు సంబంధించి రాజకీయ పార్టీలకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్తగా ఓటర్ ఐడి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు ఫొటో, చిరునామా లలో చాలా తప్పులు ఉంటున్నాయని వాటిని సరి చేసే విధంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. బల్క్ దరఖాస్తులు ఉంటే వాటిని ఇఆర్ఒ లేదా ఎఇఆర్ఒలకు మాత్రమే సమర్పించాలని చెప్పారు. బల్క్ దరఖాస్తులకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ వారు సూచించిన విధంగా సమర్పిస్తున్న దరఖాస్తులలో తప్పులు లేవని, ఒకవేళ తప్పులు ఉన్నట్లు తెలిస్తే వివిధ సెక్షన్ల కింద శిక్షార్హులు అవుతామని తెలుపుతూ అండర్ టేకింగ్ ను తప్పనిసరిగా రాజకీయ పార్టీలు సమర్పించాలని కోరారు. ఓబులవారిపల్లిలో ఓటర్ల జాబితాను స్వయంగా తనిఖీ చేసినప్పుడు చాలామంది ఓటర్లు ఓటర్ ఐడి ఉండి కూడా ఫామ్ 6ను ఇస్తున్నారని ఇలాంటివి జరగకుండా చూసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని పేర్కొన్నారు. ఓటర్ ఐడిలో ఏవైనా మార్పులు కావాలనుకుంటే ఫామ్ 8 సమర్పించే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ బూత్‌ను మార్పు చేసేందుకు ఫార్మ్ 6 కాకుండా ఫార్మ్ 8 ను సమర్పించాలని ఈ సందర్భంగా సూచించారు. జీరో డోర్ నెంబర్ ఉన్న హోటళ్లకు సంబంధించి మాట్లాడుతూ నోషనల్ నెంబర్లు ఇచ్చి సరి చేస్తున్నామని తెలియజేశారు. ఓటర్లకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటో ద్వారా లేదా ఇతర ఏదైనా వాహనాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరగా. కలెక్టర్ అందుకు ఆయన సందిస్తూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా వాలంటీర్లను ఉపయోగించుకున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని, ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలియజేశారు. అనంతరం ఇఆర్ఒలకు, ఎఇఆర్‌లతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా తయారీలో వివిధ సూచనలను చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీవోలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

భూ సేకరణ అవార్డ్స్ వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ముదివేడు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ అవార్డ్స్ వేగంగా పూర్తి చేయడంతోపాటు సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల అంశాలపై సంబంధిత తహశీల్దార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒ, ఇరిగేషన్, ఆర్డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి, హౌసింగ్, విద్యుత్, సర్వే శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు, తాగునీరు సమస్యలు అధిగమించేందుకు చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా ముదివేడు రిజర్వాయర్‌కి సంబంధించి 1075 ఎకరాలు అవసరమన్నారు. ఇందులో 425 ఎకరాలు భూసేకరణ చేసి అవార్డు పాస్ చేశారని తెలిపారు. అవార్డ్స్ పాస్ చేసిన భూమికి సంబంధించి లబ్ధిదారులకు త్వరగా పరిహారం పంపిణీ పూర్తి చేయాలన్నారు. మిగిలిన భూసేకరణకు ఆయా అంశాల వారీగా త్వరగా ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. తదుపరి వారంలోగా కురబలకోట, బి.కొత్తకోట మండలాల నుంచి అవార్డ్స్ పాస్ కొరకు ఫైల్స్ కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మిగిలిన భూసేకరణలో ప్రభుత్వ, పట్టా భూమి, డికెటి, అసైన్మెంట్ భూముల వివరాలను ఆయా తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. పట్టా భూములకు సంబంధించి ఫామ్- సిలో నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, మదనపల్లి ఆర్‌డిఒ మురళి పాల్గొన్నారు.

పంట నమోదుకు ఇకెవైసి తప్పనిసరి : జెడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతు భరోసా అధికారులు, ఉద్యాన సహాయకులు తమ పరిధిలోని పంటలకు, పంట నమోదుతో పాటు రైతులకు తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ శాఖ, రైతు భరోసా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పిఎం కిసాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6 వేలు అందాలంటే పంట నమోదుతో పాటు రైతులకు ఇకెవైసి తప్పనిసరిగా చేయించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎమ్మార్పీ ధరలకే రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని ఆదేశించారు. రైతు గ్రూపులను ఏర్పాటు చేసి ప్రతి మండలంలో మూడు కియోస్కులను 50 శాతం రాయితీతో అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కౌలు రైతులకు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులను మంజూరు చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయ సంచాలకులు జి.రమేష్ బాబు, పెనగలూరు, నందలూరు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు చిన్నారులు, వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక వెలుగు సంస్థలో పీలేరు మండలానికి జాగృతి సంస్థల అధినేత, సాయికృపా వృద్ధాశ్రమ దార్శనికుడు డాక్టర్ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ప్రోగ్రామింగ్ మేనేజర్ జె.శశికుమార్‌రెడ్డి, విజయరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ టి.రామాంజనేయులు, జి.శ్రీనివాసులు, బి.వెంకట్రామిరెడ్డి వెలుగు సంస్థకు విచ్చేసి చిన్నారులను, వృద్ధులను ప్రేమతో పలకరించి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. డాక్టర్ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా వెలుగు సంస్థలో కేక్ కట్ చేయగా అందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ప్రోగ్రామింగ్ మేనేజర్ శశికుమార్‌రెడ్డి, విజయరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ టి.రామాంజనేయులు, జి.శ్రీనివాసులు, బి.వెంకట్రామిరెడ్డి, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ రఫీక్ అహ్మద్

ఓటర్ల జాబితా సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

- తహశీల్దార్ రఫీక్ అహ్మద్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఓటరు సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు, బిఎల్ఓలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఎవరైనా చిరునామా మారి ఉన్నా, ఇక్కడికి వచ్చినా, మరణించిన తదితర అంశాలను గుర్తించి మార్పులు చేర్పులను బిఎల్ఒ, బిఎల్ఎ కలిసి చేయాలన్నారు. ఈ ఓటర్ సర్వేని బిఎల్ఒలు వైసిపి, టిడిపి వామపక్షాలు బిఎల్ఎ నాయకులతో కలిసి సకాలంలో పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ. బాలాజీ, నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, విఆం ఒలు, హైదర్, అమర్ నారాయణ, అశోక్ నాయక్, నాయకులు సిఆర్ చిన్నికృష్ణ, చాంద్‌బాషా, నక్క సంతోష్, రమేష్‌రెడ్డి, రఫీ, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం సరికాదు

ప్రజాశక్తి-కలికిరి

విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం సమంజసం కాదని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఉదయం హాజరు మొదలుకొని సాయంత్రం వరకు బోధనే కాకుండా వివిధ రకాల యాప్‌లు, నాడు-నేడు వంటి అనేక పనులతో సతమతమవుతుండటం వలన బోధనకు తీవ్ర అంతరాయం కల్గిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు హాజరు వేయడంలో నిర్ణీత సమయానికన్నా ఎంతో ముందుగా బడికి చేరుకుని యాప్‌లో హాజరుకు ప్రయత్నిస్తున్నా సర్వర్ సరిగా పనిచేయక, ఉదయం 9 గంటలు దాటాక హాజరు నమోదు అవుతుండటంతో ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనౌతున్నారని అన్నారు. సర్వర్ సమస్యను పరిష్కరించి యాప్ ఓపెన్ చేసిన వెంటనే ముఖ హాజరు నమోదయేలా చర్యలు చేపట్టి, పది నిమిషాల గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని చేశారు.

'మిషన్ ఇంద్ర ధనుష్'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నందలూరు

టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ భవాని

కేంద్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షక అధికారి డాక్టర్ భవాని కోరారు. బుధవారం మండల పరిధిలోని దుర్గా పురం, నందలూరు హరిజనవాడ, నాగిరెడ్డి పల్లి ప్రాంతాలలో కార్యక్రమం అమలు తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఏదేని కారణాల వల్ల వేయలేకపోయిన టీకాలు ఈ వారం లోపు ఉచితంగా అన్ని సచివాలయలలో అందుబాటులో ఉంచామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖరరెడ్డి, సిహెచ్ఒ నారాయణ, సూపర్వై జర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వీరబల్లి

తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లీశ్వరి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డలు ఆరోగ్యమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మో హన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టిహారం స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు కిట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లీశ్వరి, వైసిపి గాలివీటి విజయసాగర్‌రెడ్డి, ఎంపిటిసి శివరాంగౌడ్, వైసిపి సీనియర్ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, తాటి గుంటపల్లి సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు కసిరెడ్డి శ్రీరాములు రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ అమర్నాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమ ఉనికిని కాపాడుకోవడానికి టిడిపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, మంత్రి పెద్దిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మదనపల్లి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ ముబీనా,మేదర సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుజాత, వైసిపి నాయకులు రాయల్ సలీం, మేదర సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలన జీర్ణించుకోలేక చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో యాత్ర చేపట్టి టిడిపి శ్రేణులను రెచ్చ గొట్టి అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించారన్నారు.

విద్యార్థుల వివరాలను సేకరిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ త్యాగరాజు

ఆదర్శ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం జిఇఆర్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి టి.త్యాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల వివరాలను, స్థితిగతులను, విద్యా ప్రమాణాల గురించి వాలంటీర్ల ద్వారా చేపట్టిన సర్వేకు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్య ఉన్న తేడాలను గుర్తించి వాటిని సరి చేయాలన్నారు. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, పాఠశాల సముదాయ రిజర్వ్ ఉపాధ్యాయులు మణెమ్మ, లక్ష్మీదేవి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

రెండో విడత నాడు-నేడు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తెలిపారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల ఎంఇఒలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక శ్రీ భువన విద్యాలయంలో నాడు-నేడు పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాటాడుతూ జిల్లాలో 1038 పాఠశాలలు, 21 కళాశాలల్లో రూ.117 కోట్ల ఖర్చుతో నాడు-నేడు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల్లో కె.విపల్లి మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

గిరిజనుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పీలేరులో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవాసంఘం, ఆర్‌జిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కోటపల్లి వివేకానంద కూడలి నుంచి గిరిజనులు, విద్యార్థులు నాలుగురోడ్ల కూడలి, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి గిరిజనుల ఐక్యతను ప్రదర్శించారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి తీర్మాణం మేరకు 1994వ సంవత్సరం నుంచి ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఏడాది ఆదివాసిదినోత్సవం జరుగుతోందని అన్నారు. కానీ, మనకు స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా, కేంద్ర ప్రభుత్వం "ఆజాదీకా అమృత్ మహోత్సవం" అంటూ ఆడంబరాలు జరిపినా, గిరిజనులు ఇప్పటికీ పక్కా ఇండ్లకు నోచుకోకుండా అడవుల్లో చెట్ల మధ్యే పూరి గుడిసెల్లో తలదాచుకోవడం జరుగుతోందని అన్నారు.. గిరిజనులు తమ హక్కుల సాధనకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన యానాది సేవా సంఘం గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, రాష్ట్ర గిరిజన సమైక్య పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు కిల్లా విజయ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాలనీచిన్న, జిల్లా గిరిజన నాయకుడు ఆవుల కాటయ్య, గడ్డం శ్రీనివాసులు, టేకుమంద రెడ్డప్ప, కంబాల ఈశ్వరయ్య, తిరుమల శెట్టి రమణ, ఆదినారాయణ, వెంకటగిరి రాజేష్, బాబు రమేష్, కంభా నాగరాజ, పోస్టల్ దేవకుమార్, గిరిజన యానాది మహిళా నాయకురాలు నారాయణమ్మ, పులి మల్లీశ్వరి, గిరిజన సంక్షమ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

కలకడ : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ప్రజాశక్తి-కలకడ

మొక్కలు నాటి పుడమి తల్లి రుణం తీర్చుకున్నామని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా కదరాయచెరువు, నడించర్ల, కోన, గుడిబండ పంచాయతీలో కార్యక్రమం నిర్వహించి శిలాఫలకస్త ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, వసుధకు వందనం, మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి హారిక, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎపిఒ చిన్న కేసులు, కోన సర్పంచ్‌రాజగోపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి, గుడిబండ సర్పంచ్ సునీత, నడించర్ల ఎంపిటిసి కృష్ణారెడ్డి, నడించెర్ల సర్పంచ్ నరసింహారెడ్డి, నాలుగు పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, పిఒపిఆర్ అండ్‌ఆర్‌డి లతిఫ్‌ఖాన్, మండల ప్రత్యేక అహ్వాని తులు సరళ, సచివాలయం కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సత్యవతి, నాలుగు పంచాయతీల సెక్రెటరీలు జయచంద్ర, సుబ్రమణ్యం, మునిరాజ, బాలకృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె జగనన్న కాలనీలో ఊటుకూరు ఎంపిటిసి నాగచంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ పల్లెపాగు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నాభూమి.. నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. స్వాతంత్ర సమర యోధులను స్మరించుకుని వారు చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్ర మంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు. **పెనగలూరు :** మండలంలోని పొందలూరు, నారాయణనెల్లూరు, కట్టవా పల్లి గ్రామపంచాయతీలలో నాభూమి-నాదేశం కార్యమాన్ని నిర్వహించారు. ఉప ఎంపిపి విజయరెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపిడిఒ వర ప్రసాద్, ఎపిఒ మురళీ స్వాతంత్ర సమరయోధులు, పోలీసులు, సైనికుల పేర్లతో కూడిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని బయ్యప్పగారిపల్లి, శీలంవారిపల్లి, గోళ్లపల్లి, బండారువారిపల్లి గ్రామ పంచాయతీలలో మన మట్టి -మనదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆజాది కా అమృత మహోత్సవం, శిలాఫలకాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి, జడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిడిఒలు, ఎపిఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగల్లు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-గాలివీడు

కుడికాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైఎస్‌ఆర్ వెలిగల్లు ప్రాజెక్టుల మండల ప్రజలకు వరప్రసాదిని అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుడికాలువకు ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చొరవతోనే వెలిగల్లు ప్రాజెక్టు నిర్మించారని అన్నారు. ప్రజలకు, రైతులకు తాగునీరు ,సాగునీరు అందించి వర ప్రసాదినిలా వైఎస్‌ఆర్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మారిందని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సకాలంలో వర్షాలు కురవడంతో కాలువల ద్వారా నీరు విడుదల చేసే అవసరం రాలేదన్నారు. ఈ సంవత్సరం వర్షాలు కొంచెం ఆలస్యం కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే సంకల్పంతో కుడి కాలువలో ఏర్పడ్డ పూడికలకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. మిట్టపల్లి యధుభూషణరెడ్డి మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు కలుగకుండా ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముందు చూపుతో ఆలోచనతో అధికారులుతో కలసి కుడికాలువకు నీటిని విడుదల చేశారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లె, యదుభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషన్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అమరనాధరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి యూత్ లీడర్ వెంకట రమణారెడ్డి, వేణుగోపాల్ , మనోహర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, పరశురామ్, వినోద్ , అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

వైసిపి పాలనలో రాష్ట్రం సుభిక్షం :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా బుధవారం వెంగంవారిపల్లి ఒదీశీఅవగపంచాయతీలోని పిల్లగోవులపల్లి, నల్లంవారి పల్లి, దేవరెడ్డిగారిపల్లి, మండ్యంవారి పల్లి, పత్తిరిగుట్ట, సింగం వారిపల్లి గ్రామాలలో సర్పంచు జి.శ్రీవాణి నవీన్, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. తాగునీటి పైపులైన్లు, మురు గునీటి కాలువల నిర్మాణం, పింఛన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ అధికా రులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, మహదేవ రెడ్డి, చంద్రాయుడు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, నాయకులు నవీన్, మహమ్మద్ రఫీ, యుగంధర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, హేమంత్, మహేష్, శ్రీనివాసులు శెట్టి, శశిధర్ రెడ్డి, తహసిల్దార్ సి ఆర్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, ఎస్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ మురళినాయక్, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో సత్తా చాటిన 'భవిత' విద్యార్థులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పరుగు పోటీల్లో పట్టణంలోని భవిత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని మండలానికి గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒలు రెడ్డిశేఖర్, భువనేశ్వర్‌ఆచారి మాట్లాడుతూ పరుగు పోటీల్లో భవిత విద్యార్థులు జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. పరుగు పోటీల్లో ప్రతిభ కనబరచి విద్యార్థులను ప్రశంసించి, క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది పాల్గొన్నారు.

12న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

గాలివీడు : ఈ నెల 12న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రఫిక్ పేర్కొన్నారు. శనివారం శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల జరుగుతుందని తెలిపారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా కుట్లు లేకుండా ఐఎల్ మధుర వైద్యులచే ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్యశి బిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకరావాలన్నారు.

సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు

ప్రజాశక్తి-గాలివీడు

విద్యార్థుల్లో సంకల్పం ఉంటే ఏమైనా సాధించవచ్చని బాలికలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరాజు పేర్కొన్నారు. బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రత్యేక అవసరత గల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్మించేలా అందులో గాలివీడు విద్యార్థిని గాయత్రి, రెడ్డమ్మ, లావణ్య జిల్లా స్థాయిలో ప్రథమ ద్వితీయ బహుమతులు గెలుపొందారని అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ వాణిశ్రీ, స్పెషల్‌ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు వైవి.నారాయణమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ కుంద లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనకు వైసిపినే కారణం : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి

అంగళ్లు, తంబళ్లపల్లె, పుంగనూరు ల్లో చోటు చేసుకున్న సంఘటనలకు వైసిపి వారే కారణమని, వారిని వదిలేసి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు తో పాటు తనపై, తమ పార్టీ నేతలు, కార్యకర్తల పై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడం దారుణమని నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాల్లోని తంబళ్లపల్లె, అంగళ్లు, పుంగనూరు ప్రాంతాల్లోని ప్రాజెక్టుల ను పరిశీలిం చేందుకు వచ్చిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును అడ్డుకు నేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు ప్రయత్నించారని అన్నారు. తన పైనే ఇప్పటి వరకు రెండు అక్రమ కేసులు బనాయించారని తాము కేసులకు భయపడే ప్రసక్తే లేదని న్యాయ పోరాటం చేస్తామని ఆయన అన్నారు. **కలికిరి :** వైసిపి నాయకుల ప్రోద్భలంతో పోలీసులు నాయకులు కార్యకర్తల పై అక్రమ కేసులు బనాయించడం చాలా బాధాకరమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి తెలిపారు. టిడిపి నాయకులైన కలికిరి మండలం, పతేగడ గ్రామం, కొటాలకి చెందిన వాసునురి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను, పార్టీ కార్యకర్త ప్రసాద్ కుటుంబ సభ్యులను, గుర్రంకొండ మండలం, ఎల్లుట్ల గ్రామానికి చెందిన మురళిక్రిష్ణ కుటుంబ సభ్యులను, నౌషాద్ కుటుంబ సభ్యులను, అమీలేపల్లి గ్రామానికి చెందిన క్రాంతి కుటుంబ సభ్యులను, తరిగొండ గ్రామానికి చెందిన చంద్రబాబు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేట యందు ఆడి కృత్తిక పురస్కరించుకొని శ్రీశాంతి లింగేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు దాతల సహకారంతో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి -రామసముద్రం

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో రైతు భరోసా సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన సర్వే నంబర్లలో ఎంత దిగుబడి వచ్చిందో అంచనా వేయాలని సూచించారు. వేరుశనగ, రాగి, ఉలవలలో ప్రయోగాలు చేయాలన్నారు. దీనిని బట్టి దేశ ఆహార దినుసులు మొత్తం ఉత్పత్తితో పాటు పంటలబీమా కూడా వర్తిస్తుందని తెలిపారు. నిర్లక్ష్యం లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఒ జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జున్ చక్రవర్తిని సన్మానిస్తున్న మిట్స్ అధ్యాపకులు

'ఇంటర్న్‌షిప్' అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆపర్చునిటీస్ ఇన్ తైవాన్ పై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా ఆసియా విశ్వవిద్యాలయం, తైవాన్‌లో పిహెచ్‌డి చేస్తున్న మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థి అర్జున్ చక్రవర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తైవాన్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ అయిన ఎంఎస్ చేయుటకు ఎన్నో యూనివర్సిటీలు స్టేఫండ్‌తో కూడిన అడ్మిషన్లు అందిస్తున్నాయని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యార్థులు మూడవ సంవత్సరము చదువుతున్నప్పుడే తైవాన్‌లో ఉన్న యూనివర్సిటీలు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇస్తాయని, ప్రతి ఒక్కరూ వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. ఆసియా యూనివర్సిటీలో ఇలాంటి అవకాశాలు మెరుగుగా ఉన్నాయని అన్నారు. నూతన టెక్నాలజీలైన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ మొదలైన వాటిపై ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలని అన్నారు. మన కళాశాలకు తైవాన్‌లో గల ఎనిమిది యూనివర్సిటీలతో ఎంఒయులు ఉన్నాయని, తద్వారానే నేను ఆసియా యూనివర్సిటీకి వెళ్లి ఎఎస్ పూర్తి చేసి పిహెచ్‌డి కూడా చేస్తున్నానని తెలిపారు. ఇందుకు కళాశాల కరెస్పాండంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, ఇంటర్నేషనల్ డీన్ డాక్టర్ శ్రీమంతబసు,యు.విజయలక్ష్మి, ఇసిఇ విభాగాధిపతి రాజశేఖరన్, అల్మిని కో-ఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

'పిఎంఎస్' గర్భిణులకు వరం

ప్రజాశక్తి-కలకడ

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం గర్భిణులకు ఒక వరం లాంటిదని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పిహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి మూడో నెల నుంచి తొమ్మిదో నెల వరకు కనీసం ఆరు పర్యాయాలు పిఎంఎస్ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. సకాలంలో వైద్య పరీక్షలు తీసుకోవడం ద్వారా మాతృ శిశు మరణాలను అరికట్టవచ్చునని అన్నారు. పిహెచ్‌సిలో ఐరన్, సుక్రోజ్ టీకాలు తీసుకోవడం ద్వారా హిమగ్లోబిన్ పెరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు జరిగే మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్ బి.రెడ్డమ్మ, స్టాఫ్‌నర్స్ జె.భారతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.వాణి, పి.శ్రీలక్ష్మి, బి.లక్ష్మి భాగ్యమ్మ, గోపికృష్ణ. అశ్విని, రాజ సులోచన, కనకమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

నిమ్మనపల్లి : గర్భిణులు వైద్యుల సూచనలు తప్పక పాటించి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం డాక్టర్ దీక్షితారాణి స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 9,10 వతేదీలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. గర్భిణులకు బిపి, షుగర్, రక్త పరీక్షలు వంటి వైద్య పరీక్షలు నిర్వహించి, హైరిస్క్ గర్భవతులను, రక్తహీనత కలిగిన గర్భిణులను ముందుగా గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, హెల్త్ సూపర్వైజర్ .దేవకుమారి, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు, ఎం.ఎల్.హెచ్.పి లు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ వైర్లు, ఇనుప పైపుల చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో వేర్వేరు ఘటనలో విద్యుత్ వైర్లు, ఇనుప పైపులు దొంగిలించడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ ఎగువబట్టవాండ్లపల్లెకు చెందిన మద్దిశెట్టి రామమోహన, పొత్తూరి వెంకటరమణనాయుడు, దిగువబట్ట వాండ్ల పల్లెకు చెందిన సునీల్‌కుమార్ అనే వ్యక్తుల వ్యవసాయ బోరు బావుల వద్ద విద్యుత్ మోటార్లకు ఏర్పాటుచేసిన సుమారు 360 మీటర్ల డబల్ కేబుల్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన విద్యుత్ వైర్ల విలువ రూ. 84,600 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనవారిపంచాయతీలో..

మండలంలోని కోన పంచాయతీ కోన గ్రామానికి చెందిన కటారిరవి గ్రామ సమీపంలో నర్సరీ ఏర్పాటు చేశారు. ఈ నర్సరీ నిర్మాణంలో భాగంగా 13 ఇనుప పైపులను అమర్చారు. వీటిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని స్థానిక పోలీసులు పిర్యాదు చేశారు. వీటి విలువ రూ.6 వేలు ఉంటుందని తెలిపారు. కటారి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటా మండీలో కూలీపై దాడి

ప్రజాశక్తి-ములకలచెరువు

బతుకుతెరువు కోసం కూలి పనులు చేయడానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ కూలీలపై టమోటా యజమాని లారీలకు త్వరగా టమోటా గ్రేటర్‌ను లోడ్ చేయలేదని గ్రేట్‌లతో పైశాచికంగా దాడికి పాల్పడ్డ అమానుష ఘటన మంగళవారం రాత్రి ములకలచెరువులో చోటుచేసుకుంది. దాడిలో గాయపడిన బాధితుడు మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం బుధవారం వెలుగు చూసింది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి కొందరు యువకులు బ్రతుదెరువు కోసం ములకలచెరువులో ఉంటున్నారని తెలిపారు.. వీరిలో కొందరు స్థానిక కేఎన్ టమాటా మండీలో కూలి పనులు చేస్తున్నారని చెప్పారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన రుస్తుబ్ సింగ్ కుమారుడు రవిసింగ్ (23) కెఎన్ టమాటా మండిలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మండిలోని టమాటా క్రేట్లను లారికీ త్వరగా లోడు చేయలేదని యాజమాన్యం క్రెట్లతో కొట్టి అమానుష దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో గమనించిన స్థానికులు 108 వాహనములు బాధితుల్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు అతనికి మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడి కోలుకుంటున్నట్లు తెలిపారు. ఘటనపై ములకలచెరువు పోలీసులకు మదనపల్లి జిల్లా ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులు సమాచారం అందించగా కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు.